## పాలకుర్తిలో కాంగ్రెస్ గూండాగిరి

పాలకుర్తి, మే 31 : జనగామ జిల్లా పాలకుర్తిలో కాంగ్రెస్ నేతలు గూండాగిరీకి పాల్పడ్డారు. తెలంగాణ తల్లి విగ్రహం పేరిట రాజకీయం చేశారు. స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఆమె అత్త కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి గొడవకు తెరలేపారు. పాలకుర్తిలోని రాజీవ్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గతంలో నిర్మించిన తెలంగాణ తల్లి విగ్రహ గద్దెను ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ప్రోద్బలంతో శనివారం మధ్యాహ్నం కాంగ్రెస్ శ్రేణులు ఆక్రమించుకుని పునర్నిర్మాణానికి పూనుకున్నారు. గద్దె నిర్మాణాన్ని అడ్డుకోవడానికి బీఆర్‌ఎస్ నాయకులు ముందుకెళ్లగా పోలీసులతో వాగ్వాదం జరిగింది. వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. మరోవైపు సాయంత్రం కాంగ్రెస్ శ్రేణులు కర్రలు, ఇనుప రాడ్లతో బీఆర్‌ఎస్ శ్రేణులపై దాడికి దిగారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి పోలీసులతో తమ పార్టీ శ్రేణులపై కేసులు పెట్టిస్తున్నదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు మండిపడ్డారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ జోగు గోపీని అరెస్టు చేయడంపై పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు.

## ధార్మిక సంస్థల భాగస్వామ్యంతో గోశాలలు: రేవంత్



హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా, అత్యాధునిక సౌకర్యాలతో గోశాలల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పశుసంవర్ధకశాఖ అధికారులను ఆదేశించారు. గోశాలల నిర్వహణ, సంరక్షణలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గోశాలల నిర్వహణ, సంరక్షణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మొదటిదశలో వెటర్నరీ, అగ్రికల్చర్ యూనివర్సిటీలు, అనుబంధ కాలేజీలు, ఆలయాల భూముల్లో గోశాలల ఏర్పాటును పరిశీలించాలని చెప్పారు.

## బాధితుల ఫిర్యాదులను నమోదు చేయండి: డీజీపీ



హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): అనేక సమస్యలతో పోలీస్‌స్టేషన్లకు వచ్చే బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి.. కేసు నమోదు చేయాలని డీజీపీ డాక్టర్ జితేందర్ ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ యూనిట్ల నుంచి వచ్చిన స్టేషన్ హౌస్ ఆఫీ సర్లతో శనివారం డీజీపీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను నమోదు చేసి, తక్షణం దర్యాప్తు చేయాలని సూచించారు. శాంతి భద్రతల అడిషనల్ డీజీపీ మహేశ్ ఎం భగవత్ మాట్లాడుతూ.. స్టేషన్‌హౌస్ పనితీరును సమీక్షించేందుకు క్యూఆర్‌కోడ్ స్కానింగ్ దోహదం చేస్తుందని అన్నారు.

**అక్షయ విద్య ఫౌండేషన్ సేవలు అభినందనీయం..**

బస్తీ ప్రాంతాల్లో పేద విద్యార్థులకు అక్షయ విద్య ఫౌండేషన్ విలువైన సేవ చేస్తుందని డీజీపీ జితేందర్ ప్రశంసించారు. పేద విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో ఎంపికైన సందర్భంగా వారికి అభినందన కార్యక్రమాన్ని డీజీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ అక్షయ విద్య ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐజీ ఎం రమేశ్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎస్ జనార్దన్, టీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వాకిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, వారి ఆస్తులు కూడా స్వాధీనం చేసుకుంటామని డీజీపీ హెచ్చరించారు.

## ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వానికి కమిటీ నివేదిక

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్, పంచాయతీరాజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్‌కుమార్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్‌తో కలిపి త్రిసభ్య కమిటీని ఏర్పాటుచేంది. ఉద్యోగ సంఘాలతో సమావేశమైన త్రీమెన్ కమిటీ.. వారి సమస్యలకు సంబంధించిన విజ్ఞాపన పత్రాలు స్వీకరించింది. 57 డిమాండ్లను ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రభుత్వం ముందు పెట్టింది. ఇందులో 45 ఆర్థికేతర, 12 ఆర్థికపరమైన డిమాండ్లు ఉన్నాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పడిన సబ్ కమిటీకి శనివారం ప్రజాభవన్‌లో త్రీమెన్ కమిటీ నివేదిక సమర్పించింది.

## భూమి కొలతకు లక్ష డిమాండ్.. ఏసీబీ వలలో ఉద్యోగి

ఎల్లారెడ్డిపేట, మే 31: ల్యాండ్ సర్వే పంచనామా ధ్రువీకరణ పత్రానికి రూ.లక్ష లంచం డిమాండ్ చేసిన సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు శనివారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన రైతు జక్కాపూర్ మల్లేశం తన భూమి సర్వే నంబర్ 476ఈలో 3 గుంటలు, 476 జీలో 3 గుంటల కొలతల పంచనామా కోసం తహసీల్ కార్యాలయంలో అర్జీ పెట్టుకున్నారు. సర్వేయర్ మల్లోజులు నాగరాజు సంబంధిత పత్రం మంజూరు కోసం రూ.లక్ష డిమాండ్ చేశాడు. దీంతో మల్లేశం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు రూ.15 వేలు సర్వేయర్‌కు అందిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. సర్వేయర్‌ను ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్టు వారు తెలిపారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు తిరుపతి, కృష్ణ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అయినా.. శిక్ష అమలు చేయాల్సిందే : సీబీఐ

హైదరాబాద్ మే 31 (నమస్తే తెలంగాణ): ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో దోషిగా తేలిన గాలి జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యే అయినంత మాత్రాన ప్రత్యేకత ఏమీలేదని, ఆయనకు శిక్ష అమలును నిలిపివేయాల్సిన అవసరంలేదని సీబీఐ ఇటీవల హైకోర్టుకు నివేదించింది. అక్రమ మైనింగ్ కేసులో కింది కోర్టు ఇటీవల తనకు విధించిన ఏడేండ్ల జైలుశిక్షను సవాలు చేస్తూ గాలి జనార్దన్‌రెడ్డి హైకోర్టులో అప్పీలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ అప్పీలుపై విచారణ పూర్తయ్యే వరకు శిక్ష అమలును నిలిపివేయాలని ఆయన మధ్యంతర పిటిషన్ వేయడంతో సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ డైరెక్టర్లయిన బీవీ శ్రీనివాసరెడ్డి, గాలి జనార్దన్‌రెడ్డి, ఆయన పీఏ మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ మాజీ డైరెక్టర్ వీడీ రాజగోపాల్ కలిసి ప్రభుత్వాన్ని మోసగించినట్టు రుజువయ్యాకే నిందితులకు సీబీఐ కోర్టు శిక్ష విధించిందని హైకోర్టుకు వివరించింది. కింది కోర్టు తీర్పుతో 10 ఏండ్లపాటు ఎన్నికలకు దూరంగా ఉండాల్సిన గాలి జనార్దన్‌రెడ్డి.. ఓటర్లను అడ్డుపెట్టుకుని ఈ అనర్హత వేటు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, అందువల్ల ఆయన పిటిషన్‌ను కొట్టేయాలని సీబీఐ పేర్కొన్నది.

## 65 ఏండ్లకు అంగన్‌వాడీల ఉద్యోగ విరమణ

హైదరాబాద్ మే 31 (నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల విరమణ వయస్సును 65ఏండ్లుగా నిర్ణయించారు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను టీచర్లకు రూ.లక్ష నుంచి రూ.2లక్షలకు, హెల్పర్లకు రూ.50వేల నుంచి రూ. లక్షకు పెంచుతూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 60ఏండ్లు దాటి వీఆర్‌ఎస్(స్వచ్ఛంద విరమణ) పొందేవారికి వర్తింపజేయనున్నామని ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

## ఈఎన్సీగా ఉద్యోగోన్నతి.. అదే రోజున రిటైర్మెంట్

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): ఇరిగేషన్‌శాఖ సీడీవో(సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్) సీఈ మోహన్‌కుమార్‌కు ఈఎన్సీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం రోజునే ఆయన ఉద్యోగ విరమణ పొందారు. ఇరిగేషన్‌శాఖ సీడీవో సీఈగా, అదేవిధంగా ఇంటర్‌స్టేట్ వాటర్ రిసోర్స్ విభాగం సీఈగా మోహన్‌కుమార్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాజాగా ఆయనకే సీడీవో ఈఎన్సీగా ప్రభుత్వం ప్రమోషన్ కల్పించగా, శనివారం రోజునే ఆయన విరమణ పొందారు. ఇక మోహన్‌కుమార్ స్థానంలో సీడీవో సీఈగా హైడ్రాలజీ విభాగం ఎస్‌ఈ కాశీవిశ్వనాథంను ప్రభుత్వం నియమించింది. ఈయన కూడా వచ్చే నెలలో విరమణ పొందనున్నారు. మెదక్ ఎస్‌ఈగా ఈఈ వెంకటేశ్వర్‌రావు, చేవెళ్ల ఎస్‌ఈగా ఈఈ మధుసూదన్ రెడ్డి, సీడీవో ఎస్‌ఈగా ఈఈ ఎంఏ జహీర్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

## ఎన్‌ఎల్‌ఎం దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): నేషనల్ లైవ్ స్టాక్ మిషన్(ఎన్‌ఎల్‌ఎం) దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యాసాచి ఘోష్ అధికారులకు సూచించారు. శనివారం పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో జూమ్ మీటింగ్ ద్వారా జిల్లా పశు వైద్యాధికారులతో ఎన్‌ఎల్‌ఎం రాష్ట్రస్థాయి కార్యనిర్వాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశు సంవర్ధకశాఖ శాఖకు వచ్చిన 90దరఖాస్తుల్లో.. అన్ని పత్రాలు సరిగా ఉన్న 76 దరఖాస్తులను కేంద్రస్థాయిలో మంజూరుకు సిఫార్సు చేశామని తెలిపారు.

## వర్షాధార పంటలను ఎంచుకోవాలి

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): ప్రస్తుతం రైతులు వర్షాధార పంటలను ఎంచుకోవాలని వ్యవసాయ సంచాలకుడు శనివారం ఓ ప్రకటనలో సూచించారు. ప్రస్తుత వర్షాలను వినియోగించుకుని వరిసాగు చేసే రైతులు పచ్చి రొట్ట పైరులు (జనము, జీలుగ, పెసర, పిల్లిపెసర, ఉలవలు) విత్తుకోవాలని సూచించారు.



రిజర్వాయర్ నిర్మాణాన్ని రద్దు చేయాలని కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయించిన రైతులు



డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న ఇర్విన్ గ్రామస్థులు

# కాపు కాస్తడనుకున్నం.. కాష్టంలో పెడుతున్నడు!

- భూములు లాక్కుంటే బతికేదెట్లా?
- పిల్లలకు పెండ్లిళ్లు కూడా చేయలేం
- రిజర్వాయర్‌కు భూసేకరణ ఆపాలి
- పరిహారం ఇవ్వాలని డిమాండ్
- సీఎంపై ఇర్విన్ రైతుల ధ్వజం
- రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా

రంగారెడ్డి, మే 31 (నమస్తే తెలంగాణ): "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాపు కాస్తడనుకున్నాం... కానీ మమ్మల్ని కాష్టంలో పెట్టే పరిస్థితి తీసుకువస్తున్నడు. తమ ఊరిప్రక్కనే ఉన్న నాయకుడిని ముఖ్యమంత్రిగా గెలిపిస్తే కష్టాల నుంచి బయట పడేస్తడనుకున్నం. కానీ కొనితెచ్చుకున్న రేవంత్‌రెడ్డి మాకు కొత్త కష్టాలు తీసుకువస్తడనుకోలేదు" అని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. వివరాల్లోకి వెళ్తే ఇర్విన్ గ్రామంలో ప్రభుత్వం నిర్మించతలపెట్టిన రిజర్వాయర్ ప్రతిపాదనలను రద్దుచేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. తమ భూములను తమకు ఇప్పించాలని కోరుతూ రైతులు శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 1,070 ఎకరాల్లో రిజర్వాయర్ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నదని, అధికారులు రాత్రిపూట డ్రోన్లతో సర్వేలు చేస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. రహస్య సర్వేల ద్వారా అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రిజర్వాయర్ ఏర్పాటును రైతులు వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఇర్విన్ గ్రామంలో భూమి మార్కెట్లో ఎకరానికి రూ.కోటి ధర పలుకుతున్నదని, ప్రభుత్వం మాత్రం ఎకరానికి రూ.8లక్షలు ఇస్తామని చెప్తున్నదని వాపోయారు. ఈ మొత్తం ఏమాత్రం సరిపోదని స్పష్టంచేశారు. రిజర్వాయర్ ఏర్పాటు వలన రైతులకు ఏమాత్రం ప్రయోజనం ఉండదని, భూస్వాములకు, ముఖ్యమంత్రి బంధువులకే ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. భూమికి బదులుగా భూమి లేదా మెరుగైన పరిహారం ఇస్తేనే భూసేకరణకు అంగీకరిస్తామని స్పష్టంచేశారు.

### భూమిని నమ్ముకుని బతికేటోళ్లం

"మేం భూములను నమ్ముకుని బతికేటోళ్లం. కానీ ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసమో మా భూములను తీసుకుంటే ఎలా బతకగలం. కూలీనాలీ పనులకు వెళ్లలేని పరిస్థితి వస్తుంది. భూములు లేకపోతే పిల్లలకు పెళ్లిళ్లు కూడా చేయలేం. మా ఊరి ప్రక్కన ఉండే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే, మా గ్రామాన్ని ఆదుకుంటాడని అనుకున్నాం. కానీ మమ్మల్ని కష్టాల్లోకి నెట్టేశాడు. మా గ్రామంలో రిజర్వాయర్ ఏర్పాటును రద్దుచేయాలి. లేదంటే భూమికి బదులుగా భూమి ఇవ్వాల్సిందే"

–నర్సమ్మ, ఇర్విన్ గ్రామరైతు

# ఆయిల్‌పామ్ రైతులకు మోదీ షాక్

- క్రూడ్ పామాయిల్ దిగుమతుల సుంకంలో తగ్గించిన కేంద్రం
- 27.5 శాతం నుంచి 17.5 శాతానికి తగ్గింపు
- సుంకం తగ్గింపుతో స్థానిక రైతులకు తీవ్ర నష్టం

హైదరాబాద్, మే 31(నమస్తే తెలంగాణ): ఆయిల్‌పామ్ రైతులకు కేంద్రం షాకిచ్చింది. సుంకం తగ్గింపు రూపంలో వారి నెత్తిన పిడుగు వేసింది. ప్రస్తుతం 27.5 శాతంగా ఉన్న ముడి పామాయిల్ దిగుమతి సుంకాన్ని 10 శాతం తగ్గించింది. ఫలితంగా దేశంలోకి పామాయిల్‌తో పాటు ఇతర నూనెల దిగుమతులు పెరిగి, స్థానిక రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నదని ఉద్యాన నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఇబ్బందులను పట్టించుకోకుండా సుంకాలను తగ్గించడంపై మండిపడుతున్నారు. క్రూడాయిల్ దిగుమతులపై గతంలో 5 శాతం సుంకం మాత్రమే ఉండటంతో దేశీయ ఆయిల్‌పామ్ రైతులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నారు. దీంతో సుంకం పెంచాల్సిందేనంటూ రైతులతోపాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సైతం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చాయి. దీంతో దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం ఆరు నెలల క్రితం సుంకాన్ని 5శాతం నుంచి 27.5 శాతానికి పెంచింది. తాజాగా, ఇప్పుడు 10 శాతం తగ్గించి ఆయిల్‌పామ్ రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

**టన్నుకు రూ. 4 వేల కోత**

ఒక రకంగా చెప్పాలంటే ఈ నిర్ణయం పామాయిల్ రైతులకు చావుదెబ్బ లాంటిదే. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా పుంజుకుంటున్న రైతులకు ఇది భారీ దెబ్బ అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సుంకాల తగ్గింపుతో పామాయిల్ గెలల ధర భారీగా పతనమయ్యే ప్రమాదం ఉందని ఉద్యానశాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పామాయిల్ ఫ్రెష్ ఫ్రూట్ బంచ్(ఎఫ్‌ఎఫ్‌బీ) ధర టన్నుకు రూ. 20,058గా ఉన్నది. ఇది రైతులకు ఒక రకంగా మంచి ధర. అయితే ఇప్పుడు దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుంచి 17.5 శాతానికి తగ్గించడంతో ఎఫ్‌ఎఫ్‌బీ గెల ధర రూ. 16–17 వేలకు తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. అంటే టన్నుకు రూ. 3–4 వేల కోత పడడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది.

**ఓ వైపు ప్రోత్సాహం.. మరోవైపు పోటు**

ఆయిల్‌పామ్ రైతులపై కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓవైపు పామాయిల్ ఉత్పత్తిలో దేశం స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో 'మిషన్ ఆయిల్ పామ్' పేరుతో ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తున్నది. ఇందులో భాగంగానే తెలంగాణ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నది. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు చేయడం వల్ల అధిక ఆదాయం పొందవచ్చనే అవగాహనను రైతుల్లో కల్పిస్తున్నది. ఇందులో భాగంగానే 'మిషన్ ఆయిల్‌పామ్'లో భాగంగా రాష్ట్రంలో 2.43 లక్షల ఎకరాలకు ఆయిల్‌పామ్ సాగు విస్తరించింది. ఈ పరిస్థితుల్లో కేంద్రం తీసుకున్న నిర్ణయం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది. క్రూడ్ ఆయిల్ దిగుమతులపై సుంకాన్ని తగ్గించడంతో వినియోగదారులకు స్వల్ప ఊరట లభించనుంది. ఇందులో భాగంగానే పామాయిల్ లీటర్ ప్యాకెట్‌పై రూ. 8 వరకు, సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్‌పై రూ. 10 వరకు ధర తగ్గే అవకాశం ఉన్నది.

**తగ్గింపుతో రైతులకు నష్టం : తుమ్మల**

ముడి పామాయిల్‌పై కేంద్ర ప్రభుత్వం సుంకం తగ్గించడాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తప్పుబట్టారు. కేంద్రం నిర్ణయం రైతులను తీవ్రంగా నష్టపరుస్తుందని చెప్పారు. సుంకాన్ని 40 శాతానికి పెంచాలని తాము డిమాండ్ చేస్తుంటే, కేంద్రం మాత్రం అందుకు విరుద్ధంగా సుంకాన్ని తగ్గించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

## నకిలీ విత్తనాలను అరికట్టాలి

- ఆయిల్‌పామ్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి

ఖైరతాబాద్, మే 31: ఆయిల్‌పామ్ రైతులకు సరఫరా అవుతున్న నకిలీ విత్తనాలను అరికట్టాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పామ్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్షుడు తుంబూరు ఉమామహేశ్వర్ రెడ్డి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 2.10లక్షల ఎకరాల్లో 44వేల మంది రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగుచేస్తున్నారని తెలిపారు. ఆయిల్‌పామ్ పంట వేసి నష్టపోతే పరిహారం అందించేందుకు సరైన చట్టాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తన చట్టం కోసం ప్రభుత్వం కమిటీ వేసిందని, ఆ చట్టం పరిధిలోకి ఆయిల్‌పామ్ రైతులను తీసుకురావాలని కోరారు. ఆయిల్‌ఫెడ్ ప్రైవేటీకరణకు కుట్ర జరుగుతున్నదని, రాబడి ఈ రంగాన్ని కొందరు కావాలనే అప్పులఊబిలో కూరుకుపోయేలా చేస్తున్నారని ఆరోపించారు. ఆయిల్‌ఫెడ్‌లో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆయిల్‌పామ్ బలోపేతానికి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో దామోదర్‌రెడ్డి, రవికుమార్, జగ్గారావు, శ్రీరాములు, మురళీ, సురేశ్, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న కోడెల దుస్థితిని ప్రభుత్వానికి నివేదిస్తాం

- దేవాదాయ అడిషనల్ కమిషనర్లు

వేములవాడ టౌన్, మే 31: వేములవాడలోని రాజన్న ఆలయ గోశాలను దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్లు శ్రీనివారావు, కృష్ణప్రసాద్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేములవాడ శివారులోని తిప్పాపురంలో గల ఆలయ గోశాల పరిసరాలు, సంరక్షణకు చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోడెలు అనారోగ్యంతో మృతి చెందుతున్నాయనే విషయం తెలియడంతో దేవాదాయశాఖ అధికారుల ఆదేశాల మేరకు పరిశీలనకు వచ్చినట్టు తెలిపారు. ఇక్కడి పరిస్థితులు, కోడెలు ఉన్న స్థలం, వాటి సంరక్షణ తీరుపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని చెప్పారు. కోడెల సంరక్షణపై ఆలయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. వారి వెంట ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

**అకాల వర్షాలు, అనారోగ్య కారణాలతో మృతి**

వేములవాడ రాజన్న ఆలయానికి సంబంధించి తిప్పాపురంలోని గోశాలలో కోడెల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధచూపాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన గోశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కోడెలకు అందిస్తున్న



కోడెకు చికిత్స చేస్తుండగా పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

మేత, ఇతర పదార్థాల నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అకాల వర్షాలు, అనారోగ్య కారణాలతో 8 కోడెలు మృత్యువాతపడినట్టు తెలిపారు. దీనిపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయవద్దని సూచించారు. పశు వైద్యాధికారులు కోడెలకు నిరంతరం వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. కోడెల సంరక్షణను మరింత బాధ్యతగా చూసుకోవాలని, సరిపడా దాణా, పచ్చగడ్డి పెట్టాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.



గృహప్రవేశం మరుసటి రోజే కూల్చిన ఇల్లు

# గృహప్రవేశం మరునాడే ఇల్లు కూల్చివేత

- నాపై కక్షసాధింపుతోనే నేలమట్టం
- మాజీ సర్పంచ్ మల్లేశ్ ఆవేదన
- అమీన్‌పూర్‌లో కూల్చివేతలపై స్థానికుల తీవ్ర ఆగ్రహం

అమీన్‌పూర్, మే 31: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో కొందరు అధికారులు అధికార కాంగ్రెస్ పార్టీ కనుసన్నల్లో పనిచేస్తూ కేవలం బీఆర్‌ఎస్ నాయకుడి ఇంటిని కూల్చి వేసిన ఘటన తీవ్ర చర్చకు దారితీసింది. గృహప్రవేశం చేసిన మరుసటి రోజే ఇంటిని నేలమట్టం చేయడంతో సదరు కుటుంబం రోడ్డున పడింది. వివరాలు ఇలా.. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పలు సర్వే నంబర్లలో రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేతలు చేపట్టారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఉన్నాయని, ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు కూల్చివేస్తున్నట్టు పైకి చెప్తున్నా.. ఇందులో రాజకీయ జోక్యం ఉన్నట్టు తెలుస్తున్నది. సర్వే నంబర్ 947లో గృహ ప్రవేశం చేసిన ఇంటితో సహా 10 ఇండ్లను అధికారులు కూల్చివేశారు. అందులో ఐలాపూర్ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు మల్లేశ్‌కు చెందిన ఇంటిని టార్గెట్ చేసుకొని కూల్చివేతలు చేపట్టినట్టు ఆరోపణలు వస్తున్నాయి. గురువారం గృహప్రవేశం చేయగా శుక్రవారం ఇంటిని నేలమట్టం చేయడంతో మల్లేశ్ కన్నీరుపెట్టుకున్నారు. తనపట్ల కక్షగట్టి, కాంగ్రెస్ నాయకుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించడం ఏమిటని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశారు. తాను ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించిన దశలోనే అధికారులు నిలుపుదల చేసి ఉంటే ఇంతటి భారీ నష్టం వాటిల్లేదే కాదని తెలిపారు. అప్పుడు మౌనం వహించి ఇప్పుడు చర్యలు తీసుకోవడంపై ఆయన మండిపడ్డారు. కాగా, కాంగ్రెస్ పార్టీ నాయకులకు చెందిన అక్రమ ఇండ్ల నిర్మాణాలు జోలికి అధికారులు వెళ్లడం లేదని పలువురు ఆరోపణలు చేస్తున్నారు.

## పరిహారం ఇవ్వకుంటే ఆత్మహత్యలే!

- సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ వద్ద బాధిత కుటుంబం ఆందోళన

చౌటకూర్, మే 31: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల వద్ద శనివారం భూనిర్వాసిత కుటుంబం ఆందోళనకు దిగింది. సుల్తాన్‌పూర్ శివారులోని సర్వేనంబర్ 40/ఈ లోని 3.05 ఎకరాల భూమి జేఎన్టీయూ నిర్మాణంలో కోల్పోయిన బాధితుడు గొల్ల మల్లేశం కుటుంబసభ్యులు తమకు నష్టపరిహారం చెల్లించకుండా పనులు ఎలా చేపడుతారంటూ నిరసన చేపట్టారు. మల్లేశంకు చెందిన సర్వే నంబర్ 40/ఈ లోని 3.05 ఎకరాల భూమి 2012లో జేఎన్టీయూ కోసం తీసుకున్నారు. ఈ భూమితో పాటుగా సర్వే నంబర్ 41లోని 1.35 ఎకరం లావానిభూమి సైతం జేఎన్టీయూ నిర్మాణంలో కోల్పోయారు. భూమికి బదులు భూమి ఇవ్వాలని, లేనిపక్షంలో రెట్టింపు పరిహారం చెల్లించాలంటూ ఆయన మొండికేయడంతో 2011 నుంచి ఈ వివాదం కొనసాగుతున్నది. రెవెన్యూ అధికారుల సహకారంతో జేఎన్టీయూ పేరున భూసేకరణ అయిన భూమిని తిరిగి గొల్ల మల్లేశం పేరున పట్టా చేయించుకున్నాడు. ఇటీవల అధికాలు చెట్లు, ముళ్ల పొదలు తొలిగించే పనులు చేపట్టగా, మల్లేశం అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. భార్య సాయమ్మ, కుమారుడు రవి, కుటుంబ సభ్యులతో కలిసి పెట్రోల్ డబ్బాతో జేఎన్టీయూ కళాశాల వద్దకు ఆందోళన చేశారు. స్థానిక నాయకులు మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లగా ఆయన హామీ మేరకు బాధిత కుటుంబం ఆందోళన విరమించారు.

# 'ఓటుకు నోటు' కేసుకు పదేండ్లు

- ఎమ్మెల్యేకి రూ.50 లక్షల లంచం ఇవ్వజూపిన రేవంత్‌రెడ్డి
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ
- పదేండ్లు గడిచినా తేల్చని కోర్టులు



హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): తెలుగు రాష్ర్టాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుకు పదేండ్లు నిండాయి. గతంలో తెలుగుదేశం పార్టీలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరిగ్గా పదేండ్ల క్రితం శాసనమండలి ఎన్నికల్లో టీడీపీ నామినేట్ చేసిన వేం నరేందర్‌రెడ్డికి మద్దతు తెలపాలంటూ 2015 మే 31న నాటి నామినేటెడ్ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్‌కు రూ.50 లక్షలు లంచం ఇస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా అవినీతి నిరోధక శాఖకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఆ రోజు రేవంత్‌రెడ్డితోపాటు మరికొందరిని ఏసీబీ అరెస్టు చేసింది. నాటి నుంచి ఈ కేసు ఏసీబీ ప్రత్యేక కోర్టులో విచారణలో ఉన్నది. కాలక్రమంలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి సీఎం అయ్యారు. కానీ, ఆ కేసు ఇప్పటికీ కొనసాగుతున్నది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన చార్జిషీట్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు పేరును ప్రస్తావించినప్పటికీ ఏసీబీ చార్జిషీట్‌లో చంద్రబాబు పేరు లేకపోవడంతో ఆయనపై చర్యలు చేపట్టలేదు. రాజకీయంగా దుమారం రేపిన ఈ కేసు విచారణ చాలా నెమ్మదిగా కొనసాగుతున్నది. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ఒక్కసారి కూడా ఈ కేసు విచారణకు హాజరు కాలేదు.

**కేసులో కీలక పరిణామాలు**

- 2015 మే 31: నాటి నామినేటెడ్ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్‌కు రూ.50 లక్షలు ఆఫర్ చేస్తూ రేవంత్‌రెడ్డి వీడియో కెమెరాకు చిక్కడంతో అదే రోజు అరెస్టు చేసింది.
- జూన్ 1: ఇతర నిందితులు సండ్ర వెంకట వీరయ్య, ఉదయ్ సింహ, సెబాస్టియన్‌లను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. కేసు విచారణ ఏసీబీ ప్రత్యేక కోర్టుకు బదిలీ అయింది.
- జూన్ 15: రేవంత్‌రెడ్డికి హైదరాబాద్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.
- 2017 అక్టోబర్ 31: రేవంత్‌రెడ్డి టీడీపీని విడిచిపెట్టి కాంగ్రెస్ పార్టీలో చేరారు.
- 2020 నవంబర్ 11: 'ఓటుకు నోటు' కేసు విచారణను 2020 నవంబర్ 16 నుంచి ప్రారంభించాలని ఏసీబీ కోర్టు నిర్ణయించింది. విచారణకు హాజరు కావాలని రేవంత్‌రెడ్డి, సండ్ర వెంకట వీరయ్య, ఉదయ్ సింహ, సెబాస్టియన్‌ను ఆదేశించింది. దీంతో నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. కానీ, గడువు ఇచ్చేందుకు ఏసీబీ అధికారులు అభ్యంతరం తెలిపారు.
- 2021 మే 27: 'ఓటుకు నోటు' కేసులో ఈడీ చార్జిషీట్ దాఖలు చేసింది. రేవంత్‌రెడ్డిని ప్రధాన నిందితుడిగా పేర్కొన్న ఈడీ.. ఈ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పాత్రను కూడా ప్రస్తావించింది. కానీ, ఏసీబీ చార్జిషీట్‌లో చంద్రబాబు పేరు లేకపోవడంతో ఆయనకు ఊరట కలిగింది. ఇదే సమయంలో రేవంత్‌రెడ్డిపై మనీలాండరింగ్ ఆరోపణలు నమోదయ్యాయి.
- జూన్ 2: రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. ఏసీబీ కోర్టు ఉత్తర్వులను కొట్టేయాలన్న రేవంత్ విన్నపాన్ని జస్టిస్ కే లక్ష్మణ్ తోసిపుచ్చారు.
- జూలై 7: రేవంత్‌తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)కి అధ్యక్షుడయ్యారు.
- జూలై 30: రేవంత్‌రెడ్డి డ్రైవర్ రాఘవేందర్ రెడ్డి, వ్యక్తిగత సహాయకుడు సైదయ్యకు ఏసీబీ కోర్టు సమన్లు జారీ చేసింది. వారు విచారణకు హాజరు కాకపోవడంతో బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యాయి. 2021 ఆగస్టు 9న విచారణకు హాజరు కావాలని కోర్టు ఆదేశించింది.
- 2023 డిసెంబర్ 9: రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.
- 2024 సెప్టెంబర్ 24: రేవంత్‌రెడ్డి సహా ఇతర నిందితులంతా విచారణకు గైర్హాజరయ్యారు. 2024అక్టోబర్ 16న వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు స్పష్టం చేసినా రేవంత్‌రెడ్డి పట్టించుకోలేదు.